# 18

# మరుగుజ్జులు

'ఏమండోయ్ నేనొకటి డిస్కవరీ చేశాను' అంది రీటా.

ఏమిటా డిస్కవరీ అని మే మెవ్వరమూ అడగలేదు.

'ఏమిటని అడగరేం?' అంది రీటా.

'ఆడువారి నోరు తప్పెటయు ఒకటని' ఒక కవి చెప్పాడు. గనక ఆడవారిని అడుగ నవసరంలేదు. కాసేపుంటే నువ్వే చెబుతావు. కాదు కాదు దండోరా వేస్తావు' అన్నాడు కవి.

'ఎంగిలి మాటలు ఏరుకొని సిద్ధంగా ఉన్నావన్నమాట' అంది రీటా.

'పోనీ ఆ డిస్కవరీ ఏమిటో చెప్పు తల్లీ చంపక' అన్నాను నేను.

'ఏం లేదండీ సాహిత్యస్థాయి, ముఖ్యంగా కవిత్వస్థాయి ప్రపంచమంతటా కూడా పడిపోయింది' అన్నది రీటా.

'రీటా నువ్వు సినిక్‌వి అయిపోతున్నావు. సినిసిజం మనిషిలో ప్రవేశించిందా, దానికి ఇక మందులేదు' అన్నాడు కవి.

కానీ, నువ్వు మరీ మరుగుజ్జువై పోతున్నావు. అందుకే నేను సినిక్‌గా కన్పిస్తున్నాను. ఉన్నమాటంటే వులుకెందుకు? అన్నది రీటా.

'ఇంతకూ సాహిత్యస్థాయి. పడిపోతోందన్న అభిప్రాయం ఉన్నట్టుండి ఎందుకు కలిగింది' అన్నాను.

'అవధరింపుడు కథాక్రమం బెట్టిదనిన, మొన్న ఒక కవయిత్రి కనిపించి, ఇంగ్లీషులో మంచి పొయిట్రీ వస్తున్నది చదువు అంది. ఎవర్ని చదవమంటారు? అన్నాను. జాన్‌మేబీ ఇప్పుడు రాస్తున్న

వాళ్ళలో సుప్రసిద్ధుడు. ఆయన్ను చదువు అంది. ఎలాగో సంపాదించి చదివాను వట్టి Trash! ఇదిగో ఆయనకు కీర్తి తెచ్చిన గేయం ఒకటి అనువాదం చేసి ఇక్కడికి తెచ్చాను' అంది రీటా.

'ఇంగ్లీషు పొయిట్రీని విమర్శించేదాకా వచ్చావా రీటా?' అన్నాడు కవి.

'ఏం ఇంగ్లీషులో రాసిన కవులకి నెత్తిన కొమ్ములు మొలిచాయా?' అంది రీటా.

'నెత్తిన కొమ్ములు మొలవడం ఆధిక్యతకు చిహ్నం కాదు. పశుత్వానికి చిహ్నం' అన్నాడు గణపతి.

'మీరుండండి గణపతిగారూ, ఇంగ్లీషు వాడేం కర్మ. వాడి తాతను కూడా విమర్శిస్తాను. స్వాతంత్రం నా జన్మహక్కు. వాళ్ళ భావాలను అరువు తెచ్చుకునే నీలాటి వాళ్ళకు ములాజా లుంటాయేమో, నాకేం లేవు' అంది.

పోనీ ఆ గేయం కాస్త చదివి వినిపించమ్మా వింటాను అన్నాను.

'నువ్వు చదవవోయ్ సత్యనారాయణ బాగా చదువుతావు' అన్నాడు గణపతి.

'అదేం లాభం లేదండీ గణపతిగారూ. వచ్చి ప్రోజును కూడా కవిత్వంలాగా చదివి జనంచేత చప్పట్లు కొట్టించే ఒడుపు మన కవిగారికి ఉంది. కాబట్టి నేనే చదువుతాను.' అంది రీటా. నేను సరే నన్నాను రీటా మొదలు పెట్టింది.

'జీవితం ముళ్ళ పొదమీద
అందంగా మెరుస్తున్న
ఆశా తుషార కిరణాల్ని
ఆ లింగనం చేసుకుంటూ
ఉషస్సు ఉన్మీలిస్తోంది
పిచ్చుకల రొదలో
పిచ్చి కలల ఎద
సరిగమల సవరిస్తోంది
లేమి వనితా నితంబంమీద
కామితం వేళ్ల చప్పుళ్ళు
విప్లవ సంకేతాల్ని
వినిపిస్తున్నాయి'

కవిత చదవడం పూర్తిచేసి 'ఎలా ఉందండీ' అన్నది రీటా.

'ఎంతయినా ఇంగ్లీషు కవిత్వం కాదా రీటా, అద్భుతంగా ఉంది' అన్నాడు గణపతి.

'అవునమ్మాయి చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. కవిత్వమంటే ఇలా ఉండాలి' అన్నాను నేను.

'అయ్యా నాకు పవర్‌ఫుల్‌గానూ కనిపించలేదు. పాయింటెడ్ గానూ కనిపించలేదు. అర్థం పర్థంలేని ప్రేలాపనలాగా కనిపించింది. ఉషస్సు అంటాడు.లేమివనితా నితంబం అంటాడు. ఒకదానికీ ఎక్కడా పొంతన కన్పించడం లేదు. ఇదేం కవిత్వం? కవిగారు తమ అమూల్యమైన అభిప్రాయాన్ని చెప్పలేదు. శంఖులో పోస్తేగాని తీర్థం కానట్లు, మీరు చెబితేగాని దీనికి సంపూర్ణత్వం సిద్ధించదు' అన్నది రీటా.

'రీటా నాకు చూడ ఇది గొప్ప కవిత్వంలాగా కనిపిస్తోంది. ఇలాటి భావమే నాకూ తట్టింది. రాసివుంటే ఇమిటేట్ చేశానని వుందువు' అన్నాడు కవి.

'అబ్బెబ్బే అలా చూస్తే అనను. గ్రేట్ మెన్ థింక్ ఎ లైక్! గొప్పవాళ్లు అంతా ఒకేరకంగా ఆలోచిస్తారు. ఇంతకూ ఇందులో అర్థమేమిటో నాకు బోధపడలేదు' అంది రీటా.

కవిత్వం అనుభవించడానికే గాని అర్థం చెప్పడానికికాదు. లేమి వనితా – విప్లవ సంకేతం – ఉన్నదే అది పోరాటానికి పిలుపు అన్నాడు పోరాటకవి.

'ఏడ్చాడు పోరాటానికి పిలుపు ఇచ్చేవాడు సంగీతం అంటాడేమిటి?'

'అమ్మాయ్ దేన్నయినా విమర్శించడానికి యోగ్యత ఉండాలి. అంత గొప్ప కవి రాశాడంటే అందులో ప్రతి అక్షరంలోనూ ఏదో అర్థం ఉండే ఉంటుంది. మనమూ అంత ఎత్తుకు పెరిగితే తప్ప అది అర్థంకాదు.' అన్నాడు గణపతి.

'సత్యనారాయణా! ఇది నీ కవిత్వం కంటే గొప్పగా ఉందంటావా? అన్నది రీటా.

'రీటా, నీ లాగా నేను మరీ అంత మోడెస్టీలేని వాణ్ణికాదు. ఒక ప్రపంచ ప్రసిద్ధుడు రాసిన కవిత్వాన్ని అజ్ఞానంతో నువ్వు ఏమీ లేదని కొట్టిపారేశావు. అదే అజ్ఞానంతో, ఆ కవిత్వాన్ని, నా కవిత్వంతో పోల్చుకొని సంతృప్తి పడలేను' అన్నాడు సత్యనారాయణ.

'కవికుల తిలకా నీ మోడెస్టీకి సంతోషించాను. ముందిది చెప్పు ఈ దేశం బాగుపడుతుందంటావా?' అన్నది రీటా.

'ఇది వెధవ సందేహం' అన్నాడు కవి.

'వెధవ సందేహం అన్నది షష్టీ తత్పురుషమైతే తక్షణమే ఉపసంహరించుకోవాలి, సభ్యతకు విరుద్ధం' అన్నాడు గణపతి.

షష్టితత్పురుషం కాదులెమ్మన్నాడు కవి.

'నాది వెధవ సందేహం కాదు. పచ్చి సత్యం. ఈ దేశం బాగుపడుతుందా అని మరోసారి అడుగుతున్నా, తమలాంటి పెద్దలకి బానిస మనస్తత్వం వదల్లేదు. గొప్పవాడు రాసిన చెత్తలో గొప్పదనం చూడటానికి ప్రయత్నిస్తారు. రాసిందాన్ని చూడరు. రాసిన వాడిని చూస్తారు. వాడిపేరు ప్రఖ్యాతుల్ని చూస్తారు. ఆ పేరు ప్రఖ్యాతులతో వాడి రాతల్ని కొలుస్తారు. అది ఇప్పుడే కనుక్కున్నాను.

'ఇందాక నేను చదివింది జాన్‌మేబీది కాదు. అసలు జాన్‌మేబీ అన్న కవిగాడు ఈ ప్రపంచంలో ఎక్కడా లేడు గనక ఇందాక నేను కక్కింది నా పైత్యం. ఆ పైత్యమే మీ కళ్ళకి గొప్పగా కనిపించింది. ఇప్పుడు చెప్పండి దేశం బాగుపడుతుందంటారా' అన్నది రీటా.

మా ముగ్గురి ముఖాల్లోనూ, ముఖ్యంగా కవిగారి ముఖంలో నెత్తురుచుక్క లేదు!

- (1970, విశాలాంధ్ర)